

స్ఫూర్తిప్రదాతలు 8లో▸

రక్తదానంపై అవగాహన కల్పిస్తున్న పలువురు యువకులు దాతలను ప్రోత్సహిస్తున్నారు. నేడు రక్తదాతల దినోత్సవం సందర్భంగా వారి అభిప్రాయాలతో కథనం..

బీజేపీ రాష్ట్ర కార్యవర్గంలో చోటు

భైంసాటౌన్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గాన్ని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మంగళవారం ప్రకటించారు. జిల్లా నుంచి ఏడుగురికి చోటు లభించింది. ముధోల్ నియోజకవర్గం నుంచి పవార్ రామారావుపటేల్, భోస్లే మోహన్‌రావు పటేల్, రవి పాండే, నారాయణరెడ్డి, ఖానాపూర్ నుంచి అజ్మీరా హరినాయక్, నిర్మల్ నుంచి మల్లికార్జున్ రెడ్డి, అప్పాల గణేశ్ చక్రవర్తిని రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్ర కార్యవర్గానికి ఎంపికైనవారికి పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.

గరిష్ఠం/కనిష్ఠం
41.0/28.0

వాతావరణం

మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. వేడి గాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షకు 97 మంది గైర్హాజరు

నిర్మల్ రూరల్: జిల్లాలో మంగళవారం జరిగిన ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు 97మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఫస్టియర్ పరీక్షకు 1,483 మందికి 1,416 మంది హాజరు కాగా 67 మంది హాజరు కాలేదు. జనరల్ కేటగిరీలో 40 మందికి 40 మంది హాజరయ్యారు. ఒకేషనల్ కేటగిరీలో 1,523 మందికి 1,456మంది హాజరు కాగా 67 మంది గైర్హాజరయ్యారు. సెకండియర్‌లో 387 మందికి 357 మంది హాజరు కాగా, 30 మంది హాజరు కాలేదు. ఇందులో జనరల్ కేటగిరీలో 11మందికి తొమ్మిదిమంది హాజరు కాగా ఇద్దరు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కేటగిరీలో 398 మందికి 366 మంది హాజరు కాగా 32 మంది హాజరు కాలేదు. డీఐఈవో పరశురాం భైంసా, ముధోల్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

పరీక్ష కేంద్రం పరిశీలన

భైంసాటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఇంటర్ విద్యాధికారి పరశురాం మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో విద్యార్థుల హాజరు, తదితర వివరాలు పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలని, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట డీఈసీ సభ్యులు తుకారాం, రవికిరణ్, కళాశాల ప్రిన్సిపాల్ జుఫిషాన్ సుల్తానా ఉన్నారు.

మంత్రి 'అల్లోల'కు ఆహ్వానం



మంత్రికి ఆహ్వానపత్రిక ఇస్తున్న నిర్వాహకులు

నిర్మల్‌టౌన్: హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ ఆలయ నిర్వాహకులు జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 20న జరిగే ఎల్లమ్మ అమ్మవారి కల్యాణోత్సవానికి హాజరు కావాలని ఆహ్వానపత్రిక అందజేశారు. అనంతరం మంత్రి దంపతులకు ఆలయ పండితులు అమ్మవారి తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందించారు. ఆలయ ఈవో అన్నపూర్ణ, చైర్మన్ సాయిబాబాగౌడ్, పాలకమండలి సభ్యులు, అల్లోల గౌతమ్‌రెడ్డి, వేదపండితులున్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- భైంసాలోని దుకాణాల్లో తనిఖీలు



షాపులో తనిఖీ చేస్తున్న అంజిప్రసాద్, వీణ

సాక్షి ఎఫెక్ట్..

భైంసాటౌన్: మేడ్చల్‌లో నకిలీ, నిషేధిత పత్తి విత్తనాలు పట్టుబడిన నేపథ్యంలో 'రైతన్నా.. జర జాగ్రత్త' శీర్షికన 'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ స్థానిక అధికారులతో కలిసి భైంసాలోని పలు విత్తన దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విత్తన నిల్వలు, స్టాక్ రిజిష్టర్లు పరిశీలించారు. అనంతరం అంజిప్రసాద్ మాట్లాడుతూ.. వ్యాపారులు రైతులకు అధిక ధరలకు విత్తనాలు విక్రయించవద్దని, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని సూచించారు. లాట్ నంబర్ తప్పనిసరిగా వేయాలని సూచించారు. రైతులు లైసెన్స్ కలిగిన డీలర్లు, వ్యాపారుల వద్ద విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. నకిలీ విత్తనాలపై సమాచారమిస్తే తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆయన వెంట భైంసా ఏడీఏ వీణ, ఏవో రాంచందర్‌నాయక్ ఉన్నారు.

నకిలీ విత్తనాలపై నిఘా ఏర్పాటు చేయాలి

తానూరు: నకిలీ విత్తనాలు రాకుండా మహారాష్ట్ర సరిహద్దులో నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఆయా గ్రామాల వ్యవసాయ విస్తరణ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రైతులకు కాలం చెల్లిన, నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయించినా వ్యాపారుల లైసెన్స్ రద్దు చేయడంతో పాటు వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయా క్లస్టర్ పరిధిలోని ఫర్టిలైజర్ షాపులను సంబంధిత ఏఈవోలు తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయా గ్రామాల ఏఈవోలు తదితరులున్నారు.



కోల్పోతున్నారు..!

- ట్రిపుల్‌ఐటీలో మరో విద్యార్థిని ఆత్మహత్య
- మానసిక ఒత్తిడి, ఆందోళనే కారణమా?
- ఆత్మహత్యలకు అడ్డుకట్ట పడేదెప్పుడో..!

భైంసా: బాసర ఆర్జీయూకేటీలో మరో విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన విద్యార్థిలోకాన్ని కలవరానికి గురి చేసింది. కోటి ఆశలతో ఇక్కడ అడుగుపెట్టిన కొందరు విద్యార్థులు వివిధ కారణాలతో మనోధైర్యం కోల్పోతున్నారు. అర్ధంతరంగా తనువు చాలించి తల్లిదండ్రులకు పుట్టెడు శోకాన్ని మిగిలిస్తున్నారు. చదువులమ్మ చెంతనే ఉన్న ఆర్జీయూకేటీలో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నా ఇక్కడి అధికారులు నిలువరించలేకపోతున్నారనే ఆరోపణలున్నాయి. మంగళవారం ట్రిపుల్‌ఐటీలో పీయూసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం గౌర్రెకల్ గ్రామానికి చెందిన దీపిక ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన విద్యార్థుల తల్లిదండ్రులను ఆందోళనకు గురి చేస్తోంది.

ఆందోళన కలిగిస్తున్న ఘటనలు

హాస్టల్, తరగతిగదుల్లో వివిధ కారణాలతో నీరసం, అసహనంతో ఒంటరిగా ఉండేవారిని అధికారులు గుర్తించలేకపోతున్నారు. దీంతో వారిలో ఒత్తిడి, ఆందోళన ఎక్కువవుతున్నట్లు తెలుస్తోంది. బాసర ట్రిపుల్‌ఐటీలో రంగారెడ్డి జిల్లా మంచల్ మండలం రంగపేట్ గ్రామానికి చెందిన పీయూసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి భానుప్రసాద్ మనోధైర్యం కోల్పోయి గతంలో కళాశాలలోని నూతన భవనంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఐదునెలల క్రితం నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం డిచ్‌పల్లి తండాకు చెందిన బీటెక్ ఫస్టియర్ విద్యార్థి రాథోడ్ సురేశ్ హాస్టల్ గదిలో సూసైడ్ చేసుకున్నాడు. 2009లో లక్ష్మణ్, 2012లో ఒకరు, 2016లో శ్రీజ, 2018లో అనూష, 2020లో సంజయ్ ఆత్మహత్య చేసుకున్నారు. విద్యార్థుల ఆత్మహత్యలు వారి కుటుంబాలకు పుట్టెడు శోకాన్ని మిగిలిస్తున్నాయి.

అంతా గ్రామీణ ప్రాంతాలవారే..

ట్రిపుల్‌ఐటీలో చదివే విద్యార్థులంతా గ్రామీణస్థాయి నుంచి వచ్చినవారే. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించినవారికే ఇక్కడ సీటు లభిస్తుంది. మొదటి రెండేళ్లు పీయూసీ, తర్వాత నాలుగేళ్లు బీటెక్ చదవాల్సి ఉంటుంది. ట్రిపుల్‌ఐటీలో మిగతా కళాశాలలకంటే భిన్నంగా ఇక్కడ నిబంధనలుంటాయి. విద్యార్థులను బయటకు అనుమతించరు. తల్లిదండ్రులకులోనికి రానివ్వరు. స్నేహితులు ఉండరు. కొత్తగా చేరిన వారితోనే బంధం కలుపుకొని వారితో కలిసిపోవాలి. అలాంటప్పుడు ఒకేసారి అన్ని విషయాలు తోటి విద్యార్థులతో చెప్పుకోని పరిస్థితి ఉండదు. పైగా మెస్‌ల ద్వారా అందించే భోజనం వీరి పూర్తి ఆకలిని తీర్చలేకపోతుందనే విషయం గతంలోనే వీరి ఆందోళనల ద్వారా రుజువైంది.

ఒత్తిడిని జయించేందుకు..

విద్యార్థులు ఒత్తిడిని జయించాలంటే క్రీడలు అవసరం. వారంలో ఒక్కరోజైన చెవులకు ఇంపైన సంగీతం, వినోదం అందించాలి. విద్యార్థుల పరిస్థితిపై ఎప్పటికప్పుడు సైకాలజిస్టులతో కౌన్సెలింగ్ ఇప్పిస్తూ వారి మానసికస్థితి తెలుసుకోవాలి. తరచూ ఒంటరిగా ఉండే విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులను పిలిచి గతంలో ఎలా ఉండేవారు... ఇప్పుడు ఎందుకు ఇలా ప్రవర్తిస్తున్నారు.. అనే విషయాలపై చర్చించాలి. క్యాంపస్ అధికారులు గుర్తించకపోయినా కుటుంబీకులైనా వారికి మనోధైర్యం కల్పించి ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా జాగ్రత్తపడే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల ఆత్మహత్యలకు అడ్డుకట్టవేయాలని పోషకులు కోరుతున్నారు.

కాంగ్రెస్‌లో చేరుతున్నా..

- ప్రకటించిన కూచాడి శ్రీహరిరావు



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ ఇచ్చిన సోనియమ్మకు కృతజ్ఞతగా కాంగ్రెస్‌లో చేరుతున్నానని ఇటీవల బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన కూచాడి శ్రీహరిరావు ప్రకటించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. సన్నిహితులు, అభిమానులు, ఉద్యమకారుల సూచన మేరకు టీకాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో బుధవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నట్లు తెలిపారు. గతంలో సోనియాగాంధీ 25 పార్లమెంట్ స్థానాలున్న ఆంధ్రప్రదేశ్‌ను కాదని 17 స్థానాలున్న తెలంగాణకు మద్దతు తెలిపారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వ్యతిరేకత ఏర్పడినా తెలంగాణలో బలిదానాలను నివారించేందుకు సోనియాగాంధీ తెలంగాణ ఏర్పాటుకు మద్దతు తెలిపి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ నుంచి తన రాజకీయ ప్రస్థానం మొదలు కాగా, ఎంపీటీసీ, జెడ్పీటీసీగా గెలుపొందానని వివరించారు.

సీఆర్పీల ఉద్యమబాట!

ఏళ్లుగా నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తున్నా తగిన గుర్తింపు రావడం లేదని భావించిన సీఆర్పీలు ఉద్యమబాట పట్టారు. తమ సమస్యల పరిష్కారంపై సర్కారు దృష్టి సారించకపోవడంతో ఆందోళనలకు సిద్ధమయ్యారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద బుధవారం నిర్వహించే ధర్నాకు ఉమ్మడి జిల్లా నుంచి తరలివెళ్లారు.

- పదేళ్ల క్రితం విధుల్లో చేరిన సమగ్ర శిక్ష క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు
- సర్వీస్ క్రమబద్ధీకరించకపోవడంతో ఉద్యోగ భద్రత కరువు
- చాలీచాలని వేతనాలు, అదనపు పనిభారంతో అవస్థలు
- నేడు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ధర్నా



లింగాపూర్‌లో బడిబయట పిల్లల సర్వే చేస్తున్న సీఆర్పీ (ఫైల్)

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	కాంప్లెక్స్‌లు	సీఆర్‌పీలు
ఆదిలాబాద్	62	59
కుమురంభీం	67	56
మంచిర్యాల	52	43
నిర్మల్	51	45

కెరమెరి(ఆసిఫాబాద్): విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం నూతన విద్యా విధానాలు అమలు చేస్తోంది. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో కీలకమైన విధులు నిర్వర్తిస్తున్న సీఆర్పీ(క్లస్టర్ రిసోర్స్ పర్సన్)ల సమస్యలను పట్టించుకోవడం లేదు. పదేళ్లుగా విధుల్లో ఉన్నా ఉద్యోగ భద్రత లేకపోవడం వారిని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. కొత్త నియామకాలు లేకపోవడంతో ప్రస్తుతం పనిచేస్తున్న వారిపై తీవ్ర పనిభారం పడుతోంది. ఉపాధ్యాయ ఎన్నికల సమయంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి ప్రకటన మేరకు న్యాయం జరుగుతుందని ఎదురుచూసినా వారికి నిరాశే ఎదురైంది. 2021 జూన్ నుంచి పెంచిన వేతనాలు అమలు చేస్తున్నా సమాన పనికి సమాన వేతనం మాత్రం వారికి అందని ద్రాక్షగానే మిగిలింది.

ఉమ్మడి జిల్లాలో 203 మంది..

జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులకు వారధిగా ఉంటూ.. పాఠశాలలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలకు అనుసంధానంగా పనిచేసేందుకు వీలుగా సీఆర్పీలను ప్రభుత్వం నియమించింది. పదేళ్ల క్రితం రాత పరీక్షల ద్వారా ప్రతీ మండలానికి ముగ్గురు చొప్పున ఎంపిక చేసి ఎమ్మార్సీ కార్యాలయ పనులు, పాఠశాలల పర్యవేక్షణ పనులు అప్పగించారు. అయితే ఉపాధ్యాయులు కార్యాలయాల్లో పనిచేస్తే విద్యార్థులు నష్టపోతారనే ఉద్దేశంతో విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయులను అత్యవసర పరిస్థితులు, ఎన్నికల విధులు, జనాభా లెక్కల విధులకు మాత్రమే వినియోగించుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. దీంతో 2011లో నూతన విధానం తీసుకువచ్చారు. దీనికి అనుగుణంగా టీటీసీ, బీఈడీ విద్యార్హతతో 2012లో రాత పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించి సర్వశిక్ష కార్యక్రమం కింద కాంట్రాక్ట్ పద్ధతిలో ఒక్కో కాంప్లెక్స్ పరిధిలో ఒక్కో సీఆర్పీని నియమించారు. ఇందులో కొంత మంది వ్యక్తిగత కారణాలతో ఉద్యోగాలు వదిలిపెట్టారు. ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 232 కాంప్లెక్స్‌లకు 203 మంది సీఆర్పీలు విధులు నిర్వర్తిస్తున్నారు.

18కి పైగా విధులు

ప్రస్తుతం సీఆర్పీలు క్షేత్రస్థాయిలో 18కి పైగా విధులు నిర్వర్తిస్తున్నారు. కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు సహాయంగా ఉంటూనే బడిబయట పిల్లల గుర్తింపు, 18 నుంచి 25 పాఠశాలల పర్యవేక్షణ, ఎస్ఎంసీ సమావేశాల నిర్వహణ, కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణ, ఏకోపాధ్యాయ పాఠశాలల్లో విధులు, మధ్యాహ్న భోజన పథకం అమలు పరిశీలన, సమగ్ర శిక్ష కార్యక్రమాల నిర్వహణ, ఎమ్మార్సీ కార్యాలయం, పాఠశాలల మధ్య అనుసంధాన కర్త, విద్యార్థుల ఆధార్ నమోదు, ఎన్నికల విధులు, యూడైస్, చైల్డ్ ఇన్ఫోలో వివరాల నమోదు తదితర పనులు చేయాలి. వీటితోపాటు జిల్లాస్థాయి అధికారులు ఆదేశాల మేరకు ఇతర పనులు చేయాల్సి ఉంటుంది. ఇటీవల స్వచ్ఛ విద్యా పురస్కార్‌కు సంబంధించి ఫొటోలు తీసుకోవడం, ఉపాధ్యాయుల డేటా అప్‌డేట్ చేయడం లాంటి బాధ్యతలు కూడా వీరికే అప్పగించారు.

ఉద్యోగ భద్రత లేక..

చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించి పనికి తగిన వేతనం చెల్లించాలని సీఆర్పీలు డిమాండ్ చేస్తున్నారు. జాబ్‌చార్ట్ ప్రకారం వీరు 15 నుంచి 18 పాఠశాలలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. అయితే సిబ్బంది కొరతతో 18 నుంచి 25 స్కూళ్ల బాధ్యతలు అప్పగించారు. ఖాళీలను భర్తీ చేసి పనిభారం తగ్గించాలని కోరుతున్నారు. ప్రస్తుతం వీరికి కేంద్ర ప్రభుత్వం 60, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం భాగస్వామ్యంతో వేతనాలు చెల్లిస్తున్నారు. అంతకుముందు వీరికి రూ.15వేలు చెల్లించగా, 2021 నుంచి 30 శాతం పెంచారు. దీని ప్రకారం రూ.19,500 అందాల్సి ఉన్నా రూ.150 కోత విధించారు.

ప్రధాన డిమాండ్లు

- సీఆర్పీలను క్రమబద్ధీకరించాలి.
- వేతనంగా రూ.42,300 చెల్లించాలి.
- ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలి.
- హెల్త్ కార్డులు అందించాలి.
- మరణించిన సీఆర్పీ కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.

రెగ్యులర్ చేయాలి



పదేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అర్హతలు ఉన్నా ఉద్యోగ భద్రత కల్పించడం లేదు. వెంటనే సీఆర్పీలను రెగ్యులర్ చేయాలి. అప్పటివరకు స్కూల్ అసిస్టెంట్ స్థాయిలో పేస్కేల్ అమలు చేయాలి. ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమానికి అందరూ తరలిరావాలి. – పవన్ కుమార్, సీఆర్పీల సంఘం కుమురంభీం జిల్లా అధ్యక్షుడు

తెలంగాణలో మహిళలకు సముచిత స్థానం



మహిళలకు రూ.5 కోట్ల స్త్రీనిధి చెక్కు అందజేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి

- రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- ఘనంగా మహిళా సంక్షేమ దినోత్సవం

నిర్మల్‌టౌన్: బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలకు సముచిత స్థానం కల్పిస్తోందని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని దివ్యగార్డెన్స్‌లో మంగళవారం మహిళా సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తోందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా సంక్షేమ పథకాల గురించి వివరించారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళల రక్షణ, భద్రతకు ప్రభుత్వం సఖీ, భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసిందని చెప్పారు. ప్రభుత్వం ద్వారా మహిళలకు అందుతున్న సేవల గురించి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి, కలెక్టర్ మహిళలకు రూ.5కోట్ల స్త్రీనిధి చెక్కు అందజేశారు. 103 మంది పాడి రైతులకు విజయ డెయిరీ ఆధ్వర్యంలో రూ.కోటి 64లక్షల 80వేల విలువైన చెక్కులు అందించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళా ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అంతకుముందు మంత్రి, కలెక్టర్‌కు మహిళలు బతుకమ్మలతో స్వాగతం పలికారు. కళాకారులు ఆటాపాటలతో అలరించారు. ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, ఆర్డీవో స్రవంతి, డీఆర్డీవో విజయలక్ష్మి, వివిధ శాఖల మహిళా అధికారులు, ఐసీడీఎస్, ఐకేపీ, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులున్నారు.

నిజాయతీ చాటుకున్న ఆటో డ్రైవర్



పోలీస్‌స్టేషన్‌లో సెల్‌ఫోన్ అప్పగిస్తున్న నరేశ్

సారంగపూర్: మండలంలోని కౌట్ల(బీ) గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కొత్తపల్లి నరేశ్ నిజాయతీ చాటుకున్నాడు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ నుంచి నిర్మల్ వస్తుండగా ఓ ప్రయాణికుడు తన సెల్‌ఫోన్ ఆటోలో మరిచిపోయాడు. దీనిని గుర్తించిన ఆటో డ్రైవర్ వెంటనే సారంగపూర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తి వివరాలు సేకరించి బాధితుడికి అప్పగిస్తామని ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. నిజాయతీ చాటుకున్న నరేశ్‌ను అభినందించారు.

ఈసారీ సర్దుబాటేనా..?

- తెరుచుకున్న పాఠశాలలు
- జిల్లాలో 521 ఉపాధ్యాయ ఖాళీలు
- బడిబాటతో పెరుగనున్న ప్రవేశాలు



- భైంసా పట్టణంలోని పిప్రి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గతేడాది 232 విద్యార్థులు ఉండగా, ఆరుగురు ఉపాధ్యాయులు ఉండాలి. కానీ, ఇద్దరు మాత్రమే రెగ్యులర్ ఉపాధ్యాయులుండగా, మరో ఇద్దరిని డిప్యూటేషన్‌పై కేటాయించారు. మన ఊరు – మనబడిలో భాగంగా ప్రస్తుతం రెండు తరగతి గదులతో నూతన భవన నిర్మాణం చేపడుతున్నారు.
- భైంసాలోని ఏపీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దాదాపు 250 మంది విద్యార్థులున్నారు. ఈ పాఠశాలలో ఇద్దరు మాత్రమే రెగ్యులర్ ఉపాధ్యాయులున్నారు. మిగిలిన సబ్జెక్టులకు నలుగురిని డిప్యూటేషన్‌పై కేటాయించారు. గతేడాది ఫిజికల్ సైన్స్ బోధించే ఉపాధ్యాయుడు లేక విద్యార్థులు తరగతులు నష్టపోయారు. కాగా, ఈసారి కూడా ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తారా.. లేదా.. అన్నది వేచిచూడాలి.

భైంసాటౌన్: బడిగంట మోగింది.. జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో విద్యాశాఖ ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించింది. ఆయా ప్రభుత్వ పాఠశాలల పరిధిలో ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలంటూ ప్రచారం చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలతో విద్యాబోధన ఎలా చేస్తారన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇదివరకు ఉపాధ్యాయ ఖాళీల స్థానంలో ప్రభుత్వం ఏటా విద్యావలంటీర్లను నియమించేది. 2020 నుంచి ప్రభుత్వం వీవీలను విధుల్లోకి తీసుకోవడం లేదు. దీంతో గతేడాది ఉపాధ్యాయ ఖాళీలను వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరిట తక్కువ విద్యార్థులున్న పాఠశాలల నుంచి ఎక్కువ విద్యార్థులున్న పాఠశాలలకు డిప్యూటేషన్‌పై కేటాయించారు. ఈసారి కూడా ఖాళీల్లో సర్దుబాటు చేస్తారా.. అనే విషయమై ఇంకా స్పష్టత రాలేదు.

బడిబాటలో భారీగా విద్యార్థుల నమోదు..

ఈనెల 3 నుంచి ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమం చేపట్టగా, శనివారం నాటికి జిల్లా వ్యాప్తంగా 3,661 మంది విద్యార్థుల నూతన ప్రవేశాలు నమోదయ్యాయి. వీటిలో 1,257 మంది ప్రైవేట్ పాఠశాలల నుంచి నమోదైనవారే ఉన్నారు. మన ఊరు – మన బడి కింద ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించిన సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం కింద అందిస్తున్న పోషకాహారం, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, తదితర ప్రయోజనాలపై వివరిస్తున్న ఉపాధ్యాయులు ఖాళీల విషయమై ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు నూతనంగా విద్యార్థుల ప్రవేశాలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థుల సంఖ్యకనుగుణంగా ఉపాధ్యాయులు లేని పరిస్థితి నెలకొంది.

సబ్జెక్టు టీచర్లేరి..?

జిల్లాలో 735 ప్రభుత్వ పాఠశాలల్లో 2022–23 విద్యాసంవత్సరంలో 49,943 మంది విద్యార్థులు ఉండగా, మన ఊరు – మన బడి కింద రూ.120 కోట్లతో 260 పాఠశాలలను ఎంపిక చేసి పనులు చేపట్టారు. వీటిలో 126 పాఠశాలల్లో పనులు పూర్తి చేసుకున్నాయి. కాగా, జిల్లావ్యాప్తంగా మొత్తం 521 ఉపాధ్యాయ ఖాళీలు ఉండగా, చాలా పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు లేరు. దీంతో ఒక సబ్జెక్టు టీచర్‌తో మరో సబ్జెక్టు బోధించడం, ఆంగ్ల, తెలుగు మాధ్యమాలకు ఒకే టీచర్ ఉండడంతో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై ప్రభావం చూపే అవకాశముంది. గతంలో ప్రభుత్వం ఏటా ఉపాధ్యాయ ఖాళీల్లో విద్యావలంటీర్లను నియమించి విద్యాబోధనలో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టేది. 2020 నుంచి ప్రభుత్వం విద్యావలంటీర్లను విధుల్లోకి తీసుకోవడం లేదు. ఇతర పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తూ నెట్టుకొస్తున్నారు.

జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీలిలా...

సబ్జెక్ట్	మంజూరు	ఖాళీలు
గణితం (ఎస్‌ఏ)	191	16
భౌతికశాస్త్రం (ఎస్‌ఏ)	180	07
జీవశాస్త్రం (ఎస్‌ఏ)	164	32
సాంఘికశాస్త్రం (ఎస్‌ఏ)	183	75
తెలుగు (ఎస్‌ఏ)	67	13
హిందీ (ఎస్‌ఏ)	42	12
ఇంగ్లిష్ (ఎస్‌ఏ)	167	01
ఉర్దూ (ఎస్‌ఏ)	11	05
హిందీ (ఎల్‌పీ)	96	01
మరాఠీ (ఎల్‌పీ)	02	02
ఉర్దూ (ఎల్‌పీ)	07	01
ఎస్‌జీటీలు	1,478	231

ఇబ్బందులు లేకుండా చర్యలు

పాఠశాలల పునఃప్రారంభం నేపథ్యంలో విద్యార్థులు ఉండి, అసలే ఉపాధ్యాయులు లేని పాఠశాలలకు సర్దుబాటు చేస్తున్నాం. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు లేని చోట ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. ఉపాధ్యాయ ఖాళీల స్థానంలో సర్దుబాటు విషయమై స్పష్టత రావాల్సి ఉంది. – రవీందర్‌రెడ్డి, డీఈవో

క్లుప్తంగా

ఆదివాసీల అభివృద్ధికి చర్యలు

• రాష్ట్రపతి ద్రౌపది ముర్ము




రాష్ట్రపతి ముర్ముతో జిల్లా ఆదివాసీలు

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి పటిష్ట చర్యలు చేపట్టనున్నామని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 16 రాష్ట్రాలకు చెందిన గిరిజన ప్రతినిధులను ఉద్దేశించి రాష్ట్రపతి మాట్లాడినట్లు ఉట్నూర్ ఐటీడీఏ ఏపీవో రాంబాబు, జేడీఎం నాగభూషణ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రం నుంచి రాష్ట్రపతితో భేటీకి వెళ్లిన పీవీటీజీలు ముందుగా పార్లమెంట్ సెంట్రల్ హాల్ సందర్శించిన అనంతరం రాష్ట్రపతితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆదివాసీ సాంస్కృతిక నృత్యాలు, ఆటాపాటలను రాష్ట్రపతి వీక్షించారు. ఆదివాసీల అభివృద్ధికి కృషిచేస్తానని వివరించినట్లు వారు తెలిపారు.

మత మార్పిడిలపై పోలీసులకు ఫిర్యాదు

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని కేఆర్‌కే కాలనీలో ఓ మతం వారు మరో కాలనీవాసులను బలవంతంగా, వారిపై ఒత్తిడి తెచ్చి మత మార్పిడిలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తు సోమవారం రాత్రి మరో మతం వారు మావల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో 20మందిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు విష్ణువర్ధన్ తెలిపారు.

నిద్రిస్తున్న వ్యక్తిపై యాసిడ్ దాడి



బాధితుడు గడపాలె మోహన్

ముధోల్: నిద్రిస్తున్న వ్యక్తిపై యాసిడ్‌తో దాడి చేసిన సంఘటన ముధోల్ మండలంలోని తరోడా గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై సాయికిరణ్ వివరాల ప్రకారం.. తరోడా గ్రామానికి చెందిన గడ్‌పాలే మోహన్ సోమవారం బంగ్లాపై నిద్రుస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి యాసిడ్‌తో దాడి చేశాడు. దీంతో మోహన్ కేకలు వేయడంతో కుటుంబీకులు, చుట్టు పక్కలు వారు గమనించి భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్సై సాయికిరణ్ పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తిరుమలకు వెళ్లి అదృశ్యం



పిట్ట బాపూరావ్

బోథ్: మండల కేంద్రానికి చెందిన పిట్ట బాపూరావ్ తిరుమల కొండపై కనిపించకుండా పోయిన ఘటన చోటుచేసుకుంది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 10వ తేదీన బోథ్ మండల కేంద్రం నుండి 10మంది తిరుపతికి వెళ్లారు. సోమవారం తిరుమలలో క్యూలైన్‌లో దైవ దర్శనానికి వెళ్తుండగా బాపురావ్ కనిపించకుండి పోయాడు. కొద్దిసేపటికి తోటివారు గమనించగా కనిపించలేదు. దీంతో వారు ఆందోళనకు గురై టీటీడీ సిబ్బందికి సమాచారం అందించారు. ఆచూకీ కోసం ఎంత వెతికినా దొరకక పోవడంతో తిరుమల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కాగా బోథ్‌లోని కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు.

స్ఫూర్తిప్రదాతలు

• నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం...

• ఆపదలో ఆదుకునే అపర 'సంజీవని'లు
• రక్తదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న పలువురు యువకులు

నిర్మల్‌ఖిల్లా: ఎంతో కాలంగా రక్తం లభ్యత అనేది రోజు రోజుకూ పెనుభూతంలా మారుతున్న సామాజిక సమస్యగా పరిణమిస్తోంది. రోడ్డు ప్రమాదాలు, కేన్సర్ చికిత్సలు, తలసేమియా , ప్రసవ సమయం.. ఇలా పలు అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరం మరింత ఎక్కువగా ఉంటుంది. గత దశాబ్దకాలంగా రక్తదానంపై అవగాహన పెరిగినప్పటికీ రక్తనిల్వలు సరిపడా ఉండడం లేదు. ఆరోగ్యకరమైన ప్రతీ వ్యక్తి స్వచ్ఛందంగా రక్తదాతగా మారడం మాత్రమే దీనికి సరైన పరిష్కారం. ఇలా జిల్లాలో తాము స్వచ్ఛందంగా నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం నేపథ్యంలో రక్తదానానికి ముందుకు రావడానికి, మరింత మందిని ఆ దిశగా ప్రోత్సహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న పలువురు యువకులు అభిప్రాయాలతో 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం...



భైంసాటౌన్ : రక్తదానం చేస్తున్న యువకుడు(ఫైల్)

ఆదర్శంగా భైంసా యువత..

భైంసాటౌన్: భైంసా పట్టణానికి చెందిన పలువురు యువకులు రక్తదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. బాధితులకు ఆపత్కాలంలో స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకొస్తూ ఎంతోమంది ప్రాణాలు నిలుపుతున్నారు. కొందరు యువకులు బ్లడ్ డోనర్స్, అయోధ్య భారతి, సహారా యూత్ పేరిట వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి అందులో రక్తదానం చేసేవారిని సభ్యులుగా చేర్చుకుంటున్నారు. అత్యవసర సమయాల్లో బాధితులకు అండగా ఉంటున్నారు.

ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్..



నేను భైంసా ఏరియాస్పత్రిలో ఒప్పంద ప్రాతిపదిన ల్యాబ్ టెక్నీషియన్‌గా చేస్తున్నాను. పలు సందర్భాల్లో ప్రమాదాల బారిన పడిన బాధితులు, గర్భిణులు రక్తం అందుబాటులో లేక ప్రాణాపాయ స్థితి ఎదుర్కొంటున్నారు. దీంతో రక్తదానం చేయాలనే ఉద్దేశంతో ప్రత్యేకంగా బ్లడ్ డోనర్స్ పేరిట వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేశాం. గ్రూపులో పోస్టు పెట్టిన వెంటనే స్పందిస్తున్నారు.

– సురేశ్, బ్లడ్ డోనర్స్ గ్రూప్ అడ్మిన్, భైంసా

అపర సంజీవని..



జిల్లా కేంద్రంలోని కురన్నపేటకు చెందిన ఈ యువకుడు 'రక్తదాతలు' అనే వాట్సాప్ గ్రూప్ ద్వారా సమాచారాన్ని అనుసంధానం చేస్తున్నాను. ఇప్పటివరకు 39సార్లు రక్తదానం చేశాను. మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా పలు ప్రశంసా పత్రాలు అందుకున్నాను. నాతో పాటు తోటి మిత్రులను సైతం ప్రోత్సహిస్తున్నాను.

– నిగులపు సంజీవ్, కురన్నపేట్,నిర్మల్

బాధితుల నేస్తం...



నేను ప్రైవేట్ అధ్యాపకుడిగా నిర్మల్ పట్టణంలో పనిచేస్తున్నాను. తాను ఇప్పటివరకు దాదాపు 25సార్లు రక్తదానం చేశాను. తాను కాకతీయ యూనివర్సిటీలో పీజీ చేసేటప్పుడు నుంచి 2012లో తొలిసారి రక్తదానం చేశాను. రక్తదానం కోసం గ్రూపును ఏర్పాటు చేసి అవసరమైన వారికి రక్తాన్ని అందజేస్తున్నాను.

– కొప్పుల నవీన్, వెంగ్వపేట్, నిర్మల్

ఆదర్శంగా ఉండాలని



నా వంతు బాధ్యతగా రక్తదానం చేస్తున్నాను. రక్తం అత్యవసరమైతే నా మిత్రుల ద్వారా కూడా రక్తదానం చేయిస్తున్నాను. 2016 సంవత్సరం నుండి రక్తదానం చేస్తున్నాను. ప్రశంస, పురస్కారాలకంటే రక్తం స్వీకరించిన వారి ఆనందమే ముఖ్యం. నేను చిన్న టిఫిన్ సెంటర్ నడుపుతుంటాను. సమాజం కోసం నావంతుగా కృషి చేస్తున్నాను.

– దర్శనం మహేష్, నిర్మల్

ముప్పును తప్పించేందుకు..



నాది జిల్లా కేంద్రంలోని బుధవార్ పేట్. చిన్నప్పటి నుంచి కష్టాల్లో ఉన్నవారిని చూస్తూ పెరిగిన. నా వంతుస్థాయిలో రక్తదానం చేస్తున్నాను. 2018నుంచి ఇప్పటివరకు 15 సార్లు రక్తదానం చేశాను. సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపులో తన నంబర్ ఉంచితే వెంటనే స్పందించి వచ్చి రక్తాన్ని అందిస్తున్నాను.

– బొప్పారపు కల్యాణ్,నిర్మల్

రక్తదానాన్ని ప్రోత్సహించాలి



రక్తదానం చేసే విధంగా యువకులను ప్రోత్సహించాలి. రక్తదానం పట్ల ఉన్న అపోహలను వీడాలి. ప్రాణపాయస్థితిలో, అత్యవసర స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేయాలి. రక్తదానం చేసిన వ్యక్తిలో ఆరోగ్య సమస్యలు దూరమవుతాయి. ఆ దిశగా రక్తదాతల్ని ప్రోత్సహించాలి.

– ప్రమోద్ చంద్రారెడ్డి, వైద్యుడు, నిర్మల్

సర్టిఫికెట్ల పరిశీలనకు ఏర్పాట్లు పూర్తి

• ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి
• ఈ నెల 14 నుంచి 26వరకు ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు..

ఆదిలాబాద్‌టౌన్: ఎస్సై, కానిస్టేబుల్ అర్హత సాధించిన అభ్యర్థులకు ఈనెల 14 నుంచి 26వ తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు ఎస్పీ డి.ఉదయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు వారికి కేటాయించిన తేదీల్లో స్థానిక పోలీస్ ఏఆర్ హెడ్‌క్వార్టర్‌కు చేరుకోవాలని సూచించారు. ఎండ తీవ్రతతో మహిళా అభ్యర్థులు గంట ముందుగానే చేరుకోవాలని తెలిపారు. జిల్లా కేంద్రంలో మొత్తం 4,918 అభ్యర్థులకు నిజ ధ్రువ పత్రాల పరిశీలన నిర్వహించబడుతుందని, అభ్యర్థులు లేనిపక్షంలో అత్యవసర సమయంలో వారి స్వీయ ధ్రువీకరణ పత్రంతో వారి రక్త సంబంధీకులతో పరిశీలనను నిర్వహించవచ్చని వివరించారు.

అభ్యర్థులు వెంట తీసుకురావాల్సిన పత్రాలివే..

అభ్యర్థులు ఇంటిమేషన్ లెటర్, పార్ట్–2 అప్లికేషన్ ప్రింట్‌అవుట్, ఆధార్ కార్డ్, ఫామ్‌లో తప్పులు సరిచేయడానికి దరఖాస్తు చేసుకున్న వారు ట్రాన్‌జాక్షన్ ఫామ్, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్స్, ఈక్వాలెంట్ సర్టిఫికెట్స్, పదో తరగతి, మెట్రిక్యులేషన్ లేదా సమాన అర్హత గల సర్టిఫికెట్, 1 నుంచి పదో తరగతి వరకు బోనఫైడ్, రెసిడెన్స్ సర్టిఫికెట్స్ తీసుకురావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 1 ఏప్రిల్ 2021 తర్వాత పొందిన ఈడబ్ల్యూ సర్టిఫికెట్, 2 జూన్ 2014 తర్వాత పొందిన కుల ధ్రువీకరణ పత్రం, 1 ఏప్రిల్ 2021 తర్వాత పొందిన నాన్– క్రిమిలేయర్ సర్టిఫికెట్లు బీసీ అభ్యర్థులు తీసుకురావాలని, అలాగే ఏజెన్సీ ప్రాంత ఎస్టీలు జీఓ 24తో కూడిన ఏజెన్సీ ప్రాంత సర్టిఫికెట్, ఎక్స్–సర్వీస్ అభ్యర్థులు పీపీఓ, డిశ్చార్జ్ బుక్, ఆర్మీ, నావీ, ఏర్ ఫోర్స్ వారు నో అబ్జెక్షన్, స్పోర్ట్ సర్టిఫికెట్స్, ఎన్‌సీసీ ఇన్‌స్ట్రక్టర్, తెలంగాణ ఎంప్లాయ్స్ సర్వీస్, తాత్కాలిక ఉద్యోగి సర్టిఫికెట్లు, విడో, విడాకులు తీసుకున్న మహిళ ఇంకో పెళ్లి చేసుకోకపోతేనే అర్హులని పేర్కొన్నారు. ఎన్‌సీసీ ఏ,బీ,సీ ఏదైన ఒకటి, హోమ్ గార్డ్ సర్టిఫికెట్, సీపీపీ, సీడీఐ, సీఎస్‌పీఎఫ, సీజేపీ సర్టిఫికెట్స్, పోలీస్ ఎక్జిక్యూటివ్ , పోలీస్ మినిస్టీరియల్, మెంబర్ ఆఫ్ స్పెషల్ ప్రొటెక్షన్, ఎల్ఎంవీ, హెచ్‌ఎంవీ, 2022 ఏప్రిల్ 25 నాటికి లైసెన్స్ పొంది రెండేళ్లై ఉండాలని తెలిపారు. హెచ్‌ఎంవీ డ్రైవింగ్ ఆపరేటర్ 2022 మే 20 నాటికి రెండేళ్లుండాలని పేర్కొన్నారు. కానిస్టేబుల్ కోసం పర్మినెంట్ లైట్ మోటార్ వెహికిల్ లైసెన్స్, టీఎస్ పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై సర్టిఫికెట్ పరిశీలన 2023 అప్లికేషన్‌కి సంబంధించి ఏమైనా సర్టిఫికెట్స్ ఉంటే తేవాలని, అదేవిధంగా స్వీయ ధ్రువీకరణతో కూడిన రెండు సెట్లు జిరాక్స్ కాపీలు తీసుకురావాలని వివరించారు.

ఎవరికీ పట్టని ఇసుక అక్రమ తవ్వకాలు

జైనథ్: జైనథ్, బేల మండలాల్లోని పెన్‌గంగ పరివాహక గ్రామాల్లో అక్రమ ఇసుక తవ్వకాలు విచ్చలవిడిగా చేపడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కళ్లముందు జేసీబీలు, డీజిల్ బోట్‌లతో హైటెక్‌గా ఇసుక తోడేస్తున్నప్పటికీ కూడా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలో అక్రమ ఇసుక తవ్వకాలు, అక్రమ రవాణాపై అధికారులను వివరణ కోరగా దాటవేసే ధోరణిలో సమాధానమిచ్చారు. జిల్లా మైనింగ్ ఏడీ రవి శంకర్‌ను వివరణ కోరగా జాతీయ రహదారిపై తరుచుగా వాహనాలు తనిఖీ చేస్తున్నామని, ఇసుక లోడ్‌తో ఉన్న వాహనాలకు జరిమానా కూడా విధించామన్నారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా కొంచెం బిజీగా ఉన్నట్లు తెలిపారు. త్వరలోనే దాడులు చేస్తామన్నారు. ఇదే విషమై జైనథ్ తహసీల్దార్ రాఘవేంద్ర రావును వివరణ కోరగా.. ఇసుక తవ్వకాల నివారణకు అన్ని రకాలు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కిందిస్థాయి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసామని, తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

కనిష్టానికి..కడెం

• 2.991 టీఎంసీలకు చేరిన నీటి మట్టం
• పదేళ్లల్లో మూడోసారి డెడ్ స్టోరేజీకి

కడెం ప్రాజెక్ట్ సమాచారం...

ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 700 అడుగులు (7.603 టీఎంసీ)
వరద గేట్లు– 18, కాలువలు– 2
ఆయకట్టు – సుమారు 68,000ఎకరాలు,(ఖరీఫ్)
డిస్ట్రిబ్యూటరీలు– 42



నీళ్లు లేక వెలవెలబోతున్న ప్రాజెక్ట్

కడెం: గత ఏడాది భారీ వరదలతో ఉప్పొంగిన కడెం ప్రాజెక్ట్ నీళ్లు లేక వెలవెలబోతోంది. గత పదేళ్ల కాలంలో మూడోసారి కనిష్ట నీటి మట్టానికి (డెడ్ స్టోరేజీకి) చేరువైంది. కడెం ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 7.603 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.991 టీఎంసీలకు పడిపోయింది. ఖరీఫ్‌లో ఉమ్మడి జిల్లాలోని కడెం, దస్తురాబాద్, జన్నారం, దండెపల్లి, హాజీపూర్, లక్సెట్టిపేట్ మండలాలల్లో సుమారు 60వేల ఎకరాలకు సాగు నీరందించిన ప్రాజెక్ట్ ఈ ఏడాది యాసంగికి 25వేల ఎకరాలకు సాగు నీటిని అందించింది. ప్రాజెక్ట్ నీటి నిల్వ క్రమంగా తగ్గుతూ డెడ్ స్టోరేజీకి చేరువైంది.

మూడోసారి కనిష్టానికి

గత పదేళ్ల కాలంలో రెండు సార్లు 2019, 2021 ప్రాజెక్ట్ నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరగా, ఈ ఏడాది సైతం అదే పరిస్థితి నెలకొంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 7.603 (700 అడుగులు) టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.991 టీఎంసీలకు(676.575అడుగులు) నీటి మట్టానికి పడిపోయింది. కడెం ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నిల్వ సామర్థ్యం 7.603 అయితే ప్రాజెక్ట్‌లో చాలా వరకు పూడిక పేరుకుపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం రెండు టీఎంసీలకు పైగానే తగ్గినట్లు సమాచారం . గత ఏడాది వచ్చిన భారీ వరదలకు సైతం ప్రాజెక్ట్‌లోకి భారీగా పూడిక వచ్చి చేరినట్లు అధికారులు భావిస్తున్నారు. వర్షాకాలంలో ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉన్న నిల్వ సామర్థ్యం అంతంత మాత్రమే ఉండడంతో వరద నీటిని గోదావరిలోకి వదలాల్సిన పరిస్థితి నెలకొంది.



కడెం ప్రాజెక్ట్ (ఫైల్)

ఆయకట్టును ఆదుకుంది...

గత ఏడాది జూలైలో వచ్చిన భారీ వరదలకు కడెం ప్రాజెక్ట్ భారీ విపత్తు సంభవించిన విషయం తెలిసిందే. గేట్లు దెబ్బతినడంతో ప్రాజెక్ట్ మొత్తం ఖాళీ అయింది. యుద్ధప్రాతిపదికన మరమ్మతులను పూర్తి చేయడంతో పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకుంది. ఒక దశలో ఖరీఫ్ పంటలు సాగవుతాయా? లేదా అనే అయోమయం నెలకొన్న సమయంలో ఖరీఫ్‌తో పాటు యాసంగికి సాగు నీరందించి ఆయకట్టును ఆదుకుంది కడెం.

రెండుపంటలకు నీళ్లిచ్చాం..

గత ఏడాది వర్షాకాల సీజన్‌లో కడెం ప్రాజెక్ట్‌కు వచ్చిన భారీ విపత్తును అధిగమించి ఖరీఫ్, యాసంగి పంటలకు నీరందించాం. ప్రాజెక్ట్ సీల్ లెవెల్ 675 అడుగులు కాగా, ప్రస్తుతం నీటి మట్టం 676 అడుగులుగా ఉంది. గత పదేళ్ల కాలంలో రెండు సార్లు డెడ్‌స్టోరేజీకి చేరగా ఆ తర్వాత ఈ ఏడాది నీటి మట్టం ఇంతగా తగ్గింది.

– బోజదాసు, డీఈ, కడెం ప్రాజెక్ట్

చైన్ స్నాచింగ్ కలకలం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలో చైన్ స్నాచింగ్ ఘటన కలకలం రేపింది. పట్టణంలోని సేవదాస్ స్కూల్ సమీపంలోని శివాలయం వద్ద నుంచి మంగళవారం సాయంత్రం ఓ మహిళ కాలినడకన వెళ్తుంది. ద్విచక్ర వాహనంపై వెనుక నుంచి వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలో నుంచి బంగారు గొలుసులా గేందుకు యత్నించారు. ఆమె గొలుసును గట్టిగా పట్టుకోవడంతో దొంగలు పరారైనట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. బాధిత మహిళ ఎవరు, చోరీకి ఎవరు యత్నించారనే వివరాలు బయటకు రాలేదు. ఈ ఘటనపై పోలీసు స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదని వన్‌టౌన్ పోలీసులు వివరించారు.

శివాలయంలో చోరీ

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని శాస్త్రినగర్ సాత్‌లోని శివాలయంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. హుండీని పగలగొట్టి అందులోని నగదు, వెండి ఆభరణాలు దొంగిలించారు. మంగళవారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు చేరుకుని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


పెట్రోల్ కల్తీ

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలో జీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌లో పెట్రోల్‌కు బదులు నీళ్లు వచ్చాయని వాహనదారుడు సుశీల్ ఆరోపించారు. ఈ విషయమై జీసీసీ మేనేజర్ గులాబ్‌సింగ్‌కు వివరణ కోరగా పెట్రోల్‌లో ఎలాంటి కల్తీ జరగలేదని, మూడు రోజుల క్రితం పెట్రోల్ పోయించుకున్నాడని, ఏమి జరిగిందో తమకు తెలియదని వివరణ ఇచ్చాడు.

అదుపుతప్పి దూసుకెళ్లిన కారు

కడెం: మండలంలోని అంబారిపేట్ గ్రామానికి చెందిన లచ్చన్న తన కారుకు మంగళవారం గ్రామ సమీపంలోని ఆలయంలో పూజలు చేయించారు. పూజ అనంతరం కారును స్టార్ట్ చేసి కొద్ది దూరం వెళ్లగానే అదుపుతప్పి దూసుకెళ్లి డ్రైనేజీని ఢీకొట్టింది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో ఏయిర్ బెలూన్స్ ఒపెన్ కావడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

శతాధిక వృద్ధురాలు మృతి



తాంసి: మండలంలోని హస్నాపూర్ గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు వయోభారంతో మంగళవారం మృతి చెందింది. హస్నాపూర్ గ్రామానికి చెందిన కంది భోజమ్మ (104) గతకొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారు జామున మృతి చెందింది. గ్రామంలోనే అత్యధిక వయస్సు రాలిగా భోజమ్మనే ఉండింది. గ్రామంలో మధ్యాహ్నం నిర్వహించిన అంత్యక్రియల్లో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

తలమడుగు: పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. దలంలోని చర్లపల్లి గ్రామానికి చెందిన ఆత్రం ఆయ్యూభాయి (25) 2021లో సోనేరావును ప్రేమ వివాహం చేసుకుంది. అయితే కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ నెల 7న పురుగుల మందుతాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందింది. తహసీల్దార్ వనజారెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై అప్పారావు పంచనామా నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జారిపడి యువజాలరి మృతి

దిలావర్‌పూర్: మండలంలోని న్యూలోలం గ్రామానికి చెందిన పడిగెల అరుణ్ (27) ప్రమాదవశాత్తు మంగళవారం తెల్లవారు జామున ఇంటిపై నుంచి పడి మృతిచెందాడు. అరుణ్ వృత్తి రీత్యా జాలరీ, అలాగే క్రీడల్లోనూ రాణిస్తున్నాడు. మండలంలో జరిగిన క్రికెట్ టోర్నీలో సైతం తనదైన ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయిలో సోమవారం రాష్ట్ర మంత్రి అల్లోల చేతుల మీదుగా అవార్డు సైతం అందుకున్నాడు. మంగళవారం ఉదయం తెల్లవారు జామున ఇంటి స్లాబ్‌పై చేపల వేటకు వెళ్లేందుకు వలను సరిచేస్తున్న క్రమంలో వల కాళ్లకు చుట్టుకుని స్లాబ్‌పై నుండి పడిపోవడంతో తలకు బలమైన గాయమై మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్సై గంగాధర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దొంగ పట్టివేత

సిరికొండ: మండలంలోని కోసుగూడ గ్రామంలో దొంగను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై నీరేష్ వివరాల ప్రకారం... కోసుగూడ గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి గ్రామంలోకి దొంగతనం చేయడానికి కేశవపట్నం గ్రామానికి చెందిన షేక్ హసన్ వచ్చాడు. దీంతో అతడిని పట్టుకున్న స్థానికులు చితకబాది పోలీసులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పశువుల పాక దగ్ధం

బేల: మండలంలోని చంపెల్లి గ్రామానికి చెందిన ఆదివాసీ రైతు కురుసంగే దీపక్‌కు చెందిన భవానీగూడ(సి) రెవెన్యూ గ్రామ శివారులోని వ్యవసాయ చేనులో మంగళవారం ఉదయం పశువుల పాక దగ్ధమైంది. ఇందులో పశుగ్రాసం, స్ప్రింక్లర్ పైప్‌లు, ఇతరాత్ర వ్యవసాయ సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. దీంతో రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. సంఘటన స్థలాన్ని అధికారులు పరిశీలించారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాతే గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పశువుల పాక దగ్ధమైందని బాధిత రైతు పోలిస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు.

ట్రాక్టర్ ట్రాలీ బోల్తా

కడెం: మండలంలోని కన్నాపూర్ గ్రామ సమీపంలో మంగళవారం ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దూర్‌తండా నుంచి ఇటుకల లోడుతో కొండుకూర్ వైపు వెళ్తుండగా ప్రమాదవశాత్తు ట్రాలీ బోల్తాపడింది. ట్రాలీ పై ఉన్న ముగ్గురు మహిళ కూలీలకు, డ్రైవర్‌కు గాయాలయ్యాయి.

ఆవులను తరలిస్తున్న వారిపై కేసు

ఖానాపూర్: టాటా ఏస్ వాహనంలో అక్రమంగా ఆవులను తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం... మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామం మీదుగా టాటా ఏస్ వాహనం కడెం వైపు నుంచి నిర్మల్ వైపు అనుమానాస్పదంగా వెళ్తుండగా దానిని ఆపి తనిఖీ చేయగా ఐదు ఆవులతో పాటు లేగదూడ కనిపించింది. వాటికి కొనుగోలు రసీదులు, అనుమతి పత్రాలు లేకపోవడంతో డ్రైవర్‌తో పాటు మరోఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు.. పట్టుకున్న ఆవులను గోశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.